


నాగిరెడ్డిపేట్ మండల కేంద్రంలో ప్రధాన రహదారిపై రాస్తారోకో చేస్తున్న చీనూర్ గ్రామ రైతులు

# ‘తరుగు’ దోపిడీని అరికట్టాలి

- రైస్‌మిల్లర్లపై రైతుల ఆగ్రహం
- అధికారులు పట్టించుకోవాలని డిమాండ్
- నాగిరెడ్డిపేట్‌లో అన్నదాతల రాస్తారోకో

ఎల్లారెడ్డి రూరల్ (నాగిరెడ్డి పేట్), ఏప్రిల్ 24: తరుగు పేరిట రైస్‌మిల్లర్లు దోపిడీకి పాల్పడుతున్నారని ఆరోపిస్తూ రైతులు ఆందోళన చేపట్టారు. నాగిరెడ్డిపేట్ మండలం చీనూర్ గ్రామానికి చెందిన రైతులు మండల కేంద్రంలోని హైదరాబాద్ ప్రధాన రహదారిపై గురువారం రాస్తారోకో నిర్వహించారు. రైస్ మిల్లర్ల దోపిడీని అరికట్టి, తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కొనుగోలు కేంద్రంలో తూకం వేయడంలో జాప్యం చేస్తున్నారని, రైస్‌మిల్ యజమానులు ప్రతి క్వింటాలుకు 7 నుంచి 11 కిలోల తరుగును తీసివేసి లెక్కిస్తున్నారని, దీంతో తాము తీవ్రంగా నష్టపోతున్నామని రైతులు ఆవేదన వ్యక్తంచేశారు. ఈ విషయమై సొసైటీ అధికారులు పట్టించుకోవాలని కోరారు. రైతుల ఆందోళన విషయం తెలుసుకున్న స్థానిక తహసీల్దార్ శ్రీనివాసరావుతోపాటు సదాశివనగర్ సీఐ సంతోష్‌కుమార్, ఎల్లారెడి, నాగిరెడ్డిపేట్ ఎస్సైలు బొజ్జ మహేశ్, మల్లారెడ్డి, పోలీసు సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకొన్నారు. ఈ సందర్భంగా తహసీల్దార్ రైతులతో మాట్లాడారు. న్యాయం చేస్తానని భరోసా ఇవ్వడంతో రైతులు ఆందోళన విరమించారు.

## రేవంత్ రెడ్డిది దిక్కుమాలిన పాలన

సీఎం రేవంత్ రెడ్డిది ఒక దిక్కూచి లేని దిక్కుమాలిన పాలన అని జీవన్‌రెడ్డి మండిపడ్డారు. రేవంత్ రెడ్డి గోబ్యాక్, కేసీఆర్ కమ్ బ్యాక్ అనేది తెలంగాణ సకలజనాభిప్రాయమని పేర్కొన్నారు. కేసీఆర్ హయాంలో తెలంగాణకు స్వర్ణయుగమని, అభివృద్ధి పరుగులు పెట్టిందని గుర్తుచేశారు. ప్రతి ఇంట్లో సంక్షేమం, ప్రతి కంట్లో సంతోషం కనిపించిందన్నారు. రాష్ట్రానికి శనిలా దాపురించిన రేవంత్ హయాంలో అభివృద్ధి, సంక్షేమం మూసీలో కలిసిపోయి ప్రతీ ఇంట్లో సంక్షోభం, ప్రతి కంట్లో విషాదం కనిపిస్తున్నదని విమర్శించారు. కాంగ్రెస్ సర్కార్ దుర్నీతికి కేసీఆర్ పదేండ్ల ప్రగతి వైభవం మసకబారుతున్నదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.ఆరు గ్యారంటీలతో అధికారంలోకి వచ్చి ఎన్నికల హామీలను పాతరేసిన కాంగ్రెస్.. పదహారు నెలల పాలనలో సీఎం రేవంత్ రెడ్డి ఫ్యామిలీ తప్ప ఎవరూ సంతోషంగా లేరన్నారు. వరంగల్ బీఆర్ఎస్ సభతో కాంగ్రెస్ సర్కార్ పతనం ఆరంభం కావడం తథ్యమని ఆయన చెప్పారు.




విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు ఆశన్నగారి జీవన్‌రెడ్డి, (పక్కన) జడ్పీ మాజీ చైర్మన్ విఠల్‌రావు, పార్టీ నాయకులు

# ఇందూరుతో బీఆర్ఎస్‌ది పేగు బంధం

- పార్టీకి తొలి అధికార పదవినందించిన జిల్లా
- కేసీఆర్‌ను మూడోసారి సీఎం చేయడంలోనూ నిజామాబాద్‌దే ప్రధాన పాత్ర
- వరంగల్ సభకు గులాబీ శ్రేణులు సమాయత్తం కావాలి
- రజతోత్సవం.. తెలంగాణ ఇంటి పండుగ లాంటిది
- రేవంత్ ది దిక్కూచి లేని దిక్కుమాలిన పాలన
- బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఆర్మూర్ మాజీ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్‌రెడ్డి

ఖలీల్‌వాడి, ఏప్రిల్ 24: నిజామాబాద్ జిల్లాతో బీఆర్ఎస్‌ది పేగు బంధమని పార్టీ జిల్లా అధ్యక్షుడు, ఆర్మూర్ మాజీ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్‌రెడ్డి పేర్కొన్నారు. బీఆర్ఎస్ ఆవిర్భావం తర్వాత పార్టీకి తొలి అధికార పదవిని అందించిన చరిత్ర నిజామాబాద్ జిల్లాదని గుర్తుచేశారు. మళ్లీ పార్టీకి పూర్వవైభవం తీసుకురావడంలో, కేసీఆర్‌ను మూడోసారి ముఖ్యమంత్రిగా చేయడంలో కూడా ఇందూరు జిల్లా ప్రధాన పాత్ర పోషిస్తుందని చెప్పారు. గురువారం జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో స్థానిక నాయకులతో సమావేశమయ్యారు. ఈ నెల 27న వరంగల్ జిల్లా ఎల్కతుర్తితో నిర్వహించనున్న బీఆర్ఎస్ రజతోత్సవ సభకు పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున తరలివెళ్లేందుకు చేస్తున్న ఏర్పాట్లపై సమీక్షించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జీవన్‌రెడ్డి మాట్లాడుతూ.. బీఆర్ఎస్ రజతోత్సవ సభకు తరలివెళ్లేందుకు జిల్లా వ్యాప్తంగా గులాబీ శ్రేణులు సమాయత్తం కావాలని పిలుపునిచ్చారు.

‘ఇందూరు జిల్లా పంతం, ఇందిరమ్మ హింసారాజ్యం అంతం’ అనే దీక్షతో వరంగల్ బాటపడదామన్నారు. సమైక్యాంధ్ర పాలనలో ఆర్మూర్‌లో నిర్వహించిన బీఆర్ఎస్ ప్లీనరీ సందర్భంగా ‘ఆర్మూర్ ప్లీనరీ పంతం, తెలంగాణ సొంతం, సమైక్య పాలన అంతం’ అనే నినాదంతో పనిచేసిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. అలాగే ఇప్పుడు కూడా వరంగల్ రజతోత్సవ సభ స్ఫూర్తిగా ఆర్మూర్ నియోజక వర్గంలో ‘గులాబీ ఆర్మీ పంతం –దుష్ట కాంగ్రెస్, భ్రష్ట బీజేపీల అంతం’ అనే దీక్ష చేపడదామని అన్నారు. బీఆర్ఎస్ రజతోత్సవాన్ని తెలంగాణ ఇంటి పార్టీ పండుగగా ఆయన అభివర్ణించారు. ఓరుగల్లు పొరుగడ్డకు తండోప తండాలుగా తరలివెళ్లి, కేసీఆర్ నాయకత్వానికి అండగా నిలుద్దామని జీవన్ రెడ్డి పిలుపునిచ్చారు. ఆర్మూరు టూ వరంగల్ గులాబీమయం చేద్దామన్నారు. నేతలు, కార్యకర్తలు గులాబీ దుస్తులు ధరించి కదం తొక్కాలని కోరారు.

### కేసీఆర్ మళ్లీ రావాలని ప్రజలు కోరుకుంటున్నారు..

హామీ ఇవ్వక పోయినా 13 లక్షల మంది పేదింటి ఆడపిల్లలకు 11వేల కోట్లు ఖర్చు పెట్టి కల్యాణలక్ష్మి పథకాన్ని అమలుచేసిన ఘనత తెలంగాణ తొలిసీఎం కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. రైతుబంధు, రైతుబీమా, ఉచిత చేప పిల్లలు, గొర్రెల పంపిణీ, కేసీఆర్ కిట్, కేసీఆర్ న్యూట్రిషన్ కిట్, కంటి వెలుగు, అమ్మ ఒడి, హాస్టల్ విద్యార్థులకు సన్నబియ్యంతో భోజనం ఇలా అనేక పథకాలు చెప్పకపోయినా అమలు చేశామని జీవన్‌రెడ్డి వివరించారు. రుణమాఫీ, రైతు భరోసా, కల్యాణ లక్ష్మి, కొత్త ఇరిగేషన్ ప్రాజెక్టులు, 24గంటల కరెంట్, ఇంటింటికీ మిషన్ భగీరథ జలాలు, మెరుగైన వైద్యం, సర్కారు విద్యా సంస్థల్లో సౌకర్యాలు, ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల్లో ఉద్యోగావకాశాలు, పింఛన్లు మళ్లీ కావాలంటే బీఆర్ఎస్ ప్రభుత్వం మళ్లీ రావాల్సిందేనని స్పష్టం చేశారు. తెలంగాణ సుభిక్షంగా ఉండాలంటే మళ్లీ కేసీఆర్ రావాలని ప్రజలు కోరుకుంటున్నారని జీవన్‌రెడ్డి తెలిపారు. సమావేశంలో జడ్పీ మాజీ చైర్మన్ దాదన్నగారి విఠల్ రావు, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు సుజిత్ సింగ్ ఠాకూర్, సత్యప్రకాశ్, శేఖర్, రాజేశ్వర్ రెడ్డి, వెల్మల్ రాజన్న, మచ్చర్ల సాగర్, మస్త ప్రభాకర్, పూజా నరేందర్, ముత్యం, రజనీష్, పోల సుధాకర్, అభిలాష్, ఏజాజ్, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్‌లో చేరికలు



గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న బాజిరెడ్డి గోవర్ధన్

డిచ్‌పల్లి, ఏప్రిల్ 24 : బీఆర్ఎస్ పార్టీలో వలసలు జోరుగా కొనసాగుతున్నాయి. తాజాగా మండలంలోని మిట్టాపల్లికి చెందిన గోపు వెంకన్న కాంగ్రెస్ పార్టీని వదిలి సొంతగూటి(బీఆర్ఎస్ పార్టీ)కి చేరారు. ఆయనకు రూరల్ మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ గురువారం గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వెంకన్న మాట్లాడుతూ బీఆర్ఎస్ వదిలి కాంగ్రెస్ పార్టీలో చేరి తప్పు చేశానని అన్నారు. ఇకపై బీఆర్ఎస్‌లోనే కొనసాగుతూ పార్టీ పటిష్టత కోసం కృషి చేస్తానన్నారు. కాంగ్రెస్ పార్టీ నుంచి బీఆర్ఎస్ పార్టీలో చేరిన వారిలో మిడిద వినోద్‌గౌడ్, గంగాధర్, సత్యనారాయణ తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు దాసరి లక్ష్మీనర్సయ్య, నర్సయ్య పాల్గొన్నారు.

## శత్రుదేశాలకు దీటైన సమాధానం ఇవ్వాలి



ఉగ్రవాద కాల్పుల్లో మరణించిన వారికి నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి వేముల, బీఆర్ఎస్ నాయకులు

- ‘పహల్గాం ఘటన’ బాధాకరం
- మాజీ మంత్రి, ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి
- ఉగ్రవాదుల కాల్పుల్లో మరణించిన వారికి నివాళులర్పించిన వేముల

వేల్పూర్ , ఏప్రిల్ 24: జమ్ముకశ్మీర్‌లోని పహల్గాంలో మంగళవారం జరిగిన ఉగ్రవాద దాడిని మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి తీవ్రంగా ఖండించారు. వేల్పూర్ మండల కేంద్రంలో పహల్గాంలో ఉగ్రవాదుల కాల్పుల్లో మరణించిన వారికి గురువారం ఆయన నివాళులర్పించారు. వారి ఆత్మకు శాంతి చేకురాలని రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఈ సందర్భంగా వేముల మాట్లాడుతూ.. పహల్గాంలో యాత్రికులపై దాడికి పాల్పడిన ఉగ్రవాదులతోపాటు ప్రోత్సహించిన సంస్థలపై శత్రుదేశాలకు భారత్ దీటైనా సమాధానం చెప్పాలన్నారు. పహల్గాం ఘటనను బీఆర్ఎస్ పార్టీ తీవ్రంగా ఖండిస్తున్నదని తెలిపారు. భారత్‌ను ఎదుర్కొనే దమ్ములేక శత్రుదేశాలు పిరికిపంద చర్యలకు పాల్పడుతున్నాయని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఇంటలిజెన్స్ వైఫల్యం వల్లే ముష్కరులు ఈ చర్యలకు పాల్పడే సాహసం చేశారని అన్నారు. మళ్లీ ఇలాంటి దాడులు జరగకుండా భద్రతను కట్టుదిట్టం చేయడంతోపాటు ఇంటలిజెన్స్ వ్యవస్థను బలోపేతం చేయడంపై కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు దృష్టి పెట్టాల్సిన అవసరం ఉన్నదన్నారు. భారత సైన్యం, ప్రజల్లో ఆత్మస్థైర్యం దెబ్బ తినకుండా దాడులు చేసిన ముష్కరులపై చెంపపెట్టు లాంటి చర్యలు కేంద్ర ప్రభుత్వం తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు రేగుల్ల రాములు, పిట్ల సత్యం, బాల్కొండ, భీమ్‌గల్, వేల్పూర్, కమ్మర్‌పల్లి బీఆర్ఎస్ పార్టీ మండల కన్వీనర్లు ప్రవీణ్ రెడ్డి, దొన్కంటి నర్సయ్యం, నాగధర్, దేవేందర్, దోళ్ల రాజేశ్వర్‌రెడ్డి, నడ్కుడ గంగారెడ్డి , మొండి అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## షకీల్‌కు ఎంపీ సురేశ్‌రెడ్డి పరామర్శ



మాజీ ఎమ్మెల్యే షకీల్‌ను పరామర్శిస్తున్న ఎంపీ సురేశ్‌రెడ్డి

బోధన్, ఏప్రిల్ 24: బోధన్ మాజీ ఎమ్మెల్యే మహ్మద్ షకీల్– ఆయేషా ఫాతిమా దంపతులను రాజ్యసభ సభ్యుడు కేఆర్ సురేశ్‌రెడ్డి గురువారం పరామర్శించారు. షకీల్ మాతృమూర్తి షగుఫ్తా ఆదిబ్ ఇటీవల మృతి చెందిన విషయం తెలిసిందే. హైదరాబాద్‌లోని షకీల్ నివాసానికి వెళ్లి పరామర్శించారు. షగుఫ్తా ఆదిబ్ మృతికి సంబంధించిన వివరాలను షకీల్‌ను అడిగి తెలుసుకొని సంతాపం వ్యక్తంచేశారు.

## ప్రశ్నిస్తే కొడతారా? బాధితుడి ఆవేదన



బనావత్ బన్నాజీ

ధర్పల్లి, ఏప్రిల్ 24: ఆరు గ్యారంటీల అమలుపై ప్రశ్నించినందుకు పోలీసులు చితకబాదారని బాధితుడు వాపోయాడు. ధర్పల్లి మండలంలోని నడిమి తండాలో పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవానికి స్థానిక ఎమ్మెల్యే భూపతిరెడ్డి వచ్చారు. ఈ సందర్భంగా జగదాంబ ఆలయ వార్షికోత్సవంలో పాల్గొన్న ఆయనను గిరిజనులు సత్కరించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేశామని చెప్పారు. ఈ క్రమంలో హామీలు అందరికీ అమలు కాలేదని అక్కడే ఉన్న బనావత్ బన్నాజీ ప్రశ్నించాడు. దీంతో నలుగురు పోలీసులు అతడ్ని పక్కకు తీసుకెళ్లారు. ప్రశ్నించినందుకు పోలీసులు తనను కొట్టారని, ధర్పల్లి సీఐ నడుము, చెంపపై రెండు దెబ్బలు వేశారని బన్నాజీ వాపోయాడు. ఏం తప్పు చేశానని తనను కొట్టారని ప్రశ్నించాడు. బాధితుడి ఆరోపణలపై ధర్పల్లి సీఐ భిక్షపతిని వివరణ కోరగా.. ఎవరినీ కొట్టలేదని చెప్పారు. ఎవరిపైనా తమకు కక్షలుండవని, ఎమ్మెల్యే కార్యక్రమం నడుస్తున్నందున అతడ్ని అక్కడి నుంచి పక్కకు తీసుకెళ్లామని వివరించారు.

## కలెక్టరేట్ ఎదుట అంగన్‌వాడీల ధర్నా




నిజామాబాద్ కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు

కంఠేశ్వర్, ఏప్రిల్ 24 : అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్స్, మినీ టీచర్స్ అందరికీ మే నెలలో ఒకేసారి సెలవులు అమలు చేయాలని అంగన్‌వాడీ టీచర్లు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు సీఐటీయూ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట గురువారం ధర్నా నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్‌లో ఏవో ప్రశాంత్‌తోపాటు ఐసీడీఎస్ సూపరింటెండెంట్ ఇంద్రకు వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకులు మాట్లాడుతూ.. అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ ప్రకారం మే నెలలో ఒకేసారి అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు, మినీ టీచర్లకు వెంటనే సెలవులు ప్రకటించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఉద్యోగ విరమణ చేసిన అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలకు రిటర్మెంట్ బెనిఫిట్స్, మినీ టీచర్లకు వేతన బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి నూర్జహాన్, అంగన్‌వాడీ యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దేవగంగు, స్వర్ణ, జిల్లా నాయకులు మంగమ్మ, శివరాజమ్మ, రాజ్యలక్ష్మి, విజయ, గోదావరి, ప్రమీల, జ్యోతి, లక్ష్మి, వాణి, సునీత పాల్గొన్నారు.

## రామారెడ్డి ఎస్సైపై సస్పెన్షన్ వేటు

రామారెడ్డి, ఏప్రిల్ 24: ఓ వ్యక్తి అదృశ్యం కేసులో నిర్లక్ష్యం వహించిన రామారెడ్డి ఎస్సై నరేశ్‌ను ఉన్నతాధికారులు సస్పెండ్ చేశారు. ఈ మేరకు ఐజీ చంద్రశేఖర్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. గతేడాది ఓ వ్యక్తి అదృశ్యం కాగా.. సంబంధీకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అయితే ఫిర్యాదుదారుల గోడును ఎస్సై నరేశ్ పట్టించుకోకపోవడం, ఎఫ్ఐఆర్ నమోదు చేయకపోవడమే కాకుండా కనీసం ప్రాథమిక విచారణ కూడా చేపట్టలేదు. ఈ విషయం ఎస్పీ దృష్టికి రావడంతో వెంటనే ఆయన విచారణ చేయించగా, కేసును 48 గంటల్లో ఛేదించారు. దీంతో విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించిన ఎస్సై నరేశ్‌పై ఐజీకి ఎస్పీ రాకేశ్‌చంద్ర నివేదిక పంపించారు. దీంతో ఎస్సైపై ఐజీ సస్పెన్షన్ వేటు వేశారు.

## కలెక్టర్ ఔదార్యం

నస్రుల్లాబాద్, ఏప్రిల్ 24 : రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఓ వ్యక్తిని దగ్గరుండి ప్రభుత్వ వాహనంలో సర్కారు దవాఖానకు తరలించి కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ ఔదార్యం చాటుకున్నారు. గురువారం మండలంలోని అంకోల్ తండా గ్రామానికి చెందిన మాలోత్ ముగ్త్యా అనే వ్యక్తి నస్రుల్లాబాద్ క్రాస్ రోడ్డు వద్ద బైక్‌పై నుంచి కిందపడగా తీవ్ర గాయాలయ్యాయి. అదే సమయంలో మండల కేంద్రంలో భూ భారతి పై అవగాహన సదస్సులో పాల్గొని బాన్సువాడ వైపు వెళ్తున్న కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ క్షతగాత్రుడిని చూసి తన వాహనాన్ని నిలిపివేయించారు. గాయపడిన మాలోత్ ముగ్త్యాను డీపీఆర్వో వాహనంలో చికిత్స నిమిత్తం బాన్సువాడ ఏరియా దవాఖానకు దగ్గరుండి తరలించి మానవతను చాటుకున్నారు.



క్షతగాత్రుడిని దగ్గరుండి దవాఖానకు తరలిస్తున్న కలెక్టర్

# సెలవుల్లోనూ ‘ప్రైవేటు’ క్లాసులు



- విద్యాశాఖ ఆదేశాలు బేఖాతరు
- తరగతులు నిర్వహిస్తున్న కొన్ని జూనియర్ కళాశాలలు
- మండిపడుతున్న విద్యార్థి సంఘాలు
- దంచి కొడుతున్న ఎండలు
- ఇబ్బంది పడుతున్న విద్యార్థులు

ఖలీల్‌వాడి, ఏప్రిల్ 24: జిల్లాలో కొన్ని ప్రైవేట్ కళాశాలు ప్రభుత్వ నిబంధనలను తుంగలోకి తొక్కుతున్నాయి. విద్యాశాఖ ఆదేశాలను బేఖాతరు చేస్తున్నాయి. ఇంటర్ కళాశాలలకు ప్రభుత్వం సెలవులు ప్రకటించింది. సెలవుల అనంతరం జూన్‌లో తరగతులు నిర్వహించాలని ఆదేశాలు జారీ చేసింది. కానీ జిల్లాలోని కొన్ని ప్రైవేట్ కళాశాలలు మాత్రం సెకండియర్ విద్యార్థులకు వేసవి సెలవుల్లోనూ తరగతులు నిర్వహిస్తూ, ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాయి. ఇప్పటికే ఎండలు తీవ్ర స్థాయిలో ఉండడంతో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొన్నిరోజులుగా జిల్లాలో 44 డిగ్రీల వరకు గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఈ నేపథ్యంలో ఎండ బారిన పడకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్‌తోపాటు వైద్యారోగ్య శాఖ అధికారులు, డాక్టర్లు సూచిస్తున్నారు. మరోవైపు ప్రైవేటు కళాశాలలు మాత్రం తరగతులు నిర్వహిస్తూ విద్యార్థుల ఆరోగ్యం దెబ్బతినేలా చేస్తున్నాయి. దీంతో వారి తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మండుతున్న ఎండల్లో తరగతులు నిర్వహిస్తే ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతుందని ఆవేదన చెందుతున్నారు. పైవేటు కాలేజీలు తరగతులు నిర్వహిస్తున్నా, సంబంధిత అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. కాలేజీల్లో కనీస వసతులు కరువైనా అధికారులు పట్టించు కోవడం లేదు. తరగతి గదుల్లో ఫ్యాన్లు లేకున్నా.. కళాశాలలో పార్కింగ్ స్థలం లేకున్నా యాజమాన్యాలను ప్రశ్నించే వారు లేకుండా పోయారు.

### విద్యార్థి సంఘాల ఆగ్రహం

ప్రభుత్వ ఆదేశాలను బేఖాతరుచేయడమేకాకుండా, ఎండలు దంచికొడుతున్నా తరగతులు నిర్వహిస్తుండడంపై విద్యార్థి సంఘాలు మండిపడుతున్నాయి.

### తనిఖీలు కరువు

విద్యాశాఖ నిబంధలను పాటించకుండా ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్న ప్రైవేట్ కళాశాలలను తనిఖీ చేసేవారే కరువయ్యారు. ప్రభుత్వ కళాశాలల్లో తనిఖిలు నిర్వహిస్తున్న అధికారులు.. ప్రైవేటు కాలేజీల్లోనూ నిర్వహిస్తే వాస్తవాలు వెలుగుచూసే అవకాశాలు ఉంటాయని తల్లిదండ్రులు అభిప్రాయపడుతున్నారు. జూన్‌లో ప్రారంభించాల్సిన ద్వితీయ సంవత్సరం తరగతులు ఇప్పటి నుంచే నిర్వహిస్తున్నారు.

దీనిపై ఇంటర్ విద్యాశాఖ అధికారి ప్రత్యేక దృష్టి సారించాలని, ప్రతి ప్రైవేట్ కళాశాలలో వసతులను తనిఖీ చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు. వేసవి సెలవుల్లో తరగతులపై ఇంటర్ జిల్లా అధికారికి ఫోన్ చేయగా లిఫ్ట్ చేయకపోవడం గమనార్హం.

### వేసవి సెలవుల్లో తరగతులు ఎలా నిర్వహిస్తారు?



“ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాయి. జూన్‌లో తరగతులు ప్రారంభించాల్సి ఉండాగా, ముందుస్తుగానే సెలవుల్లో నిర్వహిస్తున్నారు. దీనిపై అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం శోచనీయం.

– శివ, ఏబీవీపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు